

సేంద్రియ సాగుతో భూసారం
సేంద్రియ పద్ధతులతో భూసారం పెంపొందుతుందని సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ అన్నారు. - 10లో



శివ, విష్ణు ఆరాధనతో..
నిత్యం శివ, విష్ణు ఆరాధనతో సిరిసంపదలు కలుగుతాయని స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి ఉద్బోధించారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32°/15°
ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులకు ఈనెల 31 వరకు గడువు పొడిగిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎ.పుష్పలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతను బట్టి పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న రెన్యువల్, నూతన విద్యార్థులు తమ వివరాలను ఈ పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

న్యాక్ గుర్తింపునకు సహకరించాలి



మాట్లాడుతున్న ధర్మానాయక్

నల్లగొండ రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దూరవిద్యా కేంద్రం న్యాక్ వెళ్తున్న నేపథ్యంలో ఆలుమ్ని అసోసియేషన్ సభ్యులు తగిన సహకారం అందించాలని నల్లగొండ, ఖమ్మం జిల్లాల న్యాక్ కోఆర్డినేటర్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.ధర్మానాయక్ కోరారు. శుక్రవారం స్థానిక బీఆర్‌ఓయూలో నిర్వహించిన ఆలుమ్ని అసోసియేషన్ సమావేశం ఆయన మట్లాడారు. న్యాక్ గుర్తింపు కోసం దూర విద్యలో చదివిన అసోసియేషన్ సభ్యులు పూర్తి సహకారం అందించాలని.. ఫలితంగా దూర విద్యా కేంద్రానికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. దూరవిద్య అభ్యసించేవారిలో నల్లగొండ ప్రథమ స్థానంలో ఉందని.. మంచి మార్కులతో న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ సాధించుకుంటే దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాస్‌లు, ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపాల్ ఘనశ్యాం, మహిళా డిగ్రీ కళాశాల కో ఆర్డినేటర్ సుంకరి రాజారం పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణానికి భూ నిర్వాసితులు, రైతులు, గ్రామస్తులు సహకరించాలని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఐబీ డీఈ కరుణసాగర్ కోరారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందజేస్తుందని వారు చెప్పారు. సర్వం కోల్పోయిన మాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వర్తింప జేయడంతో పాటు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని, ఇంటికో ఉద్యోగం కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎస్పీ, ఐడీ డీఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ డీఏఓ సంఘమిత్ర, సీఐ శ్రీనివాసులు, సర్పంచ్ అయ్యన్న, ప్రతాప్‌రెడ్డి, నర్సిరెడ్డి, జగత్‌రెడ్డి, యాదయ్య, మల్లేష్, గణేష్, నరేష్, అజయ్, విజయలక్ష్మి, కాశయ్య, అంజమ్మ తదితరులున్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతూ రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి

మిర్యాలగూడ అర్బన్ : మారుతున్న సాంకేతికతపై పూర్తిగా పట్టు సాధించే విధంగా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇంటర్మీడియట్ విద్య రిటైర్డ్ కమిషనర్ చక్రపాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ లెర్నింగ్, ఈ పేపర్, ఎన్‌టీసీ పేపర్స్, ప్రభుత్వ పథకాలు.. అవి అందుతున్న తీరును విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అధ్యాపకులు వారితో మమేకమై బోధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.ధన్‌రాజ్, పద్మ, బాలాజీ, నాగరాజు, ప్రణతి, ప్రవీణ్, స్వామి, రామకృష్ణ, ఫాతిమా తదితరులున్నారు.

● పూర్వగిరీశుడి కల్యాణం..



యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● గవర్నర్ దర్శనం..



రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్ శుక్రవారం యాదాద్రి లక్ష్మీ నరసింహుడిని దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు

ఎవరి దారి వారిదే..!

- నీలగిరి బీఆర్‌ఎస్‌లో కానరాని సమన్వయం
- ఎమ్మెల్యే సీటే లక్ష్యంగా సొంత ఎజెండాతో ముందుకు..
- ఏ కార్యక్రమంలోనూ కలిసి పనిచేయని నేతలు
- ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేయని పార్టీ పెద్దలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నీలగిరి బీఆర్‌ఎస్‌లో ఎవరి దారి వారిదే. పార్టీ కార్యక్రమమైనా, ముఖ్యమంత్రి పుట్టినరోజైనా ఎవరి ఏర్పాట్లు వారివే. పట్టణంలోని ముఖ్య నేతలంతా కలిసి నిర్వహించిందేమీ లేదు. వారిని సమన్వయం చేసే వారు కూడా లేరు. సీనియర్లు, జూనియర్లు, ఉద్యమకారులు, వలస వచ్చిన వారంటూ పారపచ్చాలతో పట్టణ బీఆర్‌ఎస్‌లో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసే వారు లేకుండా పోయారు. కనీసం జిల్లా అధ్యక్షుడైనా వారిని ఏకతాటిపై తెచ్చేందుకు సమన్వయ సమావేశం నిర్వహించిందీ లేదు. దీంతో ఎవరికి వారు వ్యక్తిగత ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటే లక్ష్యంగా చేసుకొని వ్యక్తిగత ఇమేజ్ పెంచుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో వెళ్లారు. చాడ కిషన్‌రెడ్డి సొంతంగానే ఖమ్మం వెళ్లారు. ఇక బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తన అనుచరులతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి మండలం, పట్టణం నుంచి పార్టీ శ్రేణులను తీసుకెళ్లి బల ప్రదర్శనకు దిగారు. నియోజకవర్గంలో జరిగే ఏ అభివృద్ధి కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే వెంట పార్టీ నేతలంతా వెళ్లిన పరిస్థితి లేదు. గతేడాది కేంద్రం విధించిన జీఎస్టీ వ్యతిరేక ధర్నాలు, ధాన్యం కొనుగోలు చేయాలని చేపట్టిన ధర్నా కార్యక్రమాల్లోనూ నేతలందరికి ఆహ్వానం లేకపోవడం, ఒకరిద్దరికి ఆహ్వానం ఉన్నా పాల్గొనలేదు.

అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయంటూ..

తనకు అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయంటూ బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో ఆరు నెలలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు కూడా సొంతంగానే తన ఇంటివద్ద నిర్వహించారు. ఉద్యమ కాలం నాటి అనుచరులతో కలిసి తాజాగా గురువారం దర్వేశిపురంలో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టికెట్ తెచ్చుకుంటే పనిచేస్తామంటూ అనుచరులు చెప్పినట్లు, అందకు తాను సిద్ధమేనని ప్రకటించినట్లు తెలిసింది.

బహిరంగంగానే ప్రకటించిన చకిలం

బీఆర్‌ఎస్ నాయకుడు, నల్లగొండ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి చకిలం అనిల్‌కుమార్ కూడా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రెండోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆయనకు ఎలాంటి పదవీ రాలేదు. దీంతో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతోందని, ఇకపై సహించేది లేదని బహిరంగంగానే ప్రకటించారు. ఉద్యమకారులతో సమావేశం నిర్వహించి మరీ ప్రజల్లోకి వెళ్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తానని అంటున్నారు. కాగా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ సంపాదించుకోవాలనే లక్ష్యంతోనే ఆయన రంగంలోకి దిగారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజు ఏడాది కాలంగా తాను ఏర్పాటు చేసిన ఫౌండేషన్ పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. నియోజకవర్గంలో సేవా కార్యక్రమాల్లో మునిగిపోయారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లోనే ఎమ్మెల్యే..

ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రభుత్వ, సంక్షేమ కార్యక్రమాల్లోనే బిజీగా ఉంటున్నారు. పట్టణంలో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాత్రమే పాల్గొంటున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ, పార్కులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రూప్స్, పోలీసు అభ్యర్థులకు శిక్షణ ఇప్పించడం వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

రూ.లక్షల్లో కరెంటు బిల్లులు

- డిమాండ్ నోటీసులు ఇవ్వకుండానే వసూళ్లు
- కట్టాల్సిందేనంటూ విద్యుత్ అధికారుల ఒత్తిడి
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



ఈ ఫొటోలోని వ్యక్తి బానోతు శంకర్. ఇతనిది మిర్యాలగూడ మండలంలోని బోట్యాతండా. శంకర్ ఇంట్లోనే కిరాణషాపు నడుపుతున్నాడు. ఆ షాపులో ఒక ట్యూబ్‌లైట్, ఒక ఫ్యాను, ఒక ఫ్రిడ్జ్ మాత్రమే ఉంది. ప్రతినెల వాడకాన్ని బట్టి రూ.400 నుంచి రూ.600 వరకు మాత్రమే బిల్లు వచ్చేది. కానీ ఈనెలలో నెలవారి బిల్లుతోపాటు అధికంగా రూ.1.07లక్షల బిల్లు బకాయి ఉందని విద్యుత్ అధికారులు చెప్పారు. బిల్లుకు సంబంధించి ఎలాంటి డిమాండ్ నోటీసు ఇవ్వకుండానే.. సగమైనా కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. బిల్లు వెంటనే చెల్లించకపోతే కరెంట్ కట్ చేస్తామని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో శంకర్ లబోదిబోమంటున్నాడు.

మిర్యాలగూడ : ఇంటికి ఒక మీటరు ఉంటుంది. ఆ మీటర్ ఇంటి నుంచి బయట ఉంటుంది. ప్రతి నెల 1 నుంచి 5వ తేదీలోపు విద్యుత్ డిపార్ట్‌మెంట్ వారు వచ్చి రీడింగ్ తీసి బిల్లు ఇచ్చి వెళ్తారు. ఆ బిల్లు ఎంత చెల్లించాలో ఎప్పటివరకు చెల్లించాలో వివరాలు ఉంటాయి. దాని ఆధారంగా వినియోగదారుడు ప్రతినెల బిల్లులు చెల్లిస్తూ ఉంటాడు. కానీ, డిమాండ్ నోటీసు ఇవ్వకుండానే వేలాది రూపాయలు బిల్లులు కట్టాల్సిందేనని విద్యుత్ అధికారులు వినియోగదారులపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రతినెల వచ్చే మాదిరిగా కాకుండా మీరు వాడుకున్న విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ వెంటనే చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. గ్రామంలో కొంతమందికే వేలాది రూపాయల అదనపు బిల్లులు చెల్లించామని ఆదేశిస్తుండడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

గ్రామాల్లో కొందరికి ఈ అదనపు బిల్లులు..

మిర్యాలగూడ, వేములపల్లి, దామరచర్ల మండలాల్లో కొన్ని గ్రామాల్లో వినియోగదారులకు అదనపు కరెంట్ బిల్లులు వేస్తున్నారు. మిర్యాలగూడ మండలంలోని గూడూరు క్యాంపు, బోట్యాతండా, నాయక్ తండా, తుంగపాడు, లావూడితండా, దామరచర్ల మండలంలోని కేశవాపురం, వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెం తదితర గ్రామాల్లో వెలుగు చూసింది. ఆయా గ్రామాల్లో 20 నుంచి 30 మందికి ఈ అదనపు విద్యుత్ బిల్లులు వచ్చాయని చెబుతున్నారు. కరెంట్ సిబ్బంది వారి ఇండ్లకు వద్దకు వెళ్లి మీ విద్యుత్ బిల్లు బకాయి వేల రూపాయల్లో ఉందని, వెంటనే కార్యాలయానికి వెళ్లి చెల్లించాలని ఆదేశిస్తున్నారు. ఆ అదనపు విద్యుత్ బిల్లుల డిమాండ్ నోటీసు ఇవ్వకుండానే బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.10వేల నుంచి మొదలుకుని లక్ష రూపాయల వరకు అదనపు విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అంత బిల్లు మాకెందుకు వస్తుంది, అంత బిల్లు మేమెప్పుడు వాడుకోలేదని వినియోగదారులు మొత్తుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

అదనపు బిల్లులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : అదనపు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బోట్యానాయక్‌తండాను సందర్శించి అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గతంలో మీటర్లకు రీడింగ్ తీయలేదని సాకు చూపి ఇప్పుడు వేలాది రూపాయలు అదనపు విద్యుత్ చార్జీలు వసూలు చేయడం సరికాదన్నారు. బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, జగదీశ్‌చంద్ర, సత్యనారాయణరావు, పరుశురాములు, సైదులు, రమేష్, గాదె పద్మ, హాసిని ఉన్నారు.

గతంలో తక్కువ రీడింగ్ తీశారు

గతంలో మీటర్ రీడింగ్ తీసేటప్పుడు ఇళ్లకు తాళం వేసి ఉండడం వల్ల మినిమం బిల్లులు వేశాం. ఆ నెలలో వాడుకున్న కరెంట్ రీడింగ్ ఆధారంగా ఇప్పుడు పెండింగ్ బకాయిలు చెల్లించాలని సూచిస్తున్నాం. వాటికి ఎలాంటి డిమాండ్ నోటీసులు ఉండవు. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్నవారికి వాయిదా పద్ధతిలో చెల్లించాలని అవకాశం కల్పిస్తున్నాం. రూ.10వేల లోపు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరుతున్నాం.
– కిసాన్‌లాల్, రూరల్ ఏఈ, మిర్యాలగూడ

షీటీంతో మహిళలకు భరోసా



సూచనలు చేస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : షీటీం పోలీసులతో మహిళలకు భరోసా కల్పిస్తున్నట్లు ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. శుక్రవారం షీటీం, భరోసా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడినప్పుడు వాట్సప్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే విషయమై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీటీం బృందాలు గస్తీలో ఉండి పోకిరీలను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సీఐ రాజశేఖర్‌గౌడ్, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ నళిని, ఏఎస్‌ఐ అబేద తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ తాత్కాలిక జాబితా విడుదల

- ఉపాధ్యాయులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన
- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ బృందం

నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ తాత్కాలిక జాబితాను జిల్లా విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. జాబితా ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తోంది. తాత్కాలిక సీనియారిటీ జాబితాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి డీఈఓ కార్యాలయానికి వెళ్లి పరిశీలించారు. జాబితాలపై డీఈఓ భిక్షపతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి గత నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు విద్యాశాఖ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది. పదోన్నతికి సంబంధించి కూడా ఆయా కేటగిరీల వారీగా దరఖాస్తులు స్వీకరించారు. వీటికి సంబంధించి హార్డ్ కాపీలను ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల నుంచి స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆయా హార్డ్ కాపీల్లోని సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. మధ్యాహ్నం సమయంలో విద్యాశాఖ రాష్ట్రస్థాయి అబ్జర్వర్లు డీఈఓ కార్యాలయానికి వచ్చి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని సూచించారు.



జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఇసుక అక్రమ రవాణా నిలిపివేయాలి



ఎడ్లబండ్లతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి : మూసీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అమ్మనబోలు గ్రామస్తులు, రైతులు శుక్రవారం ఎండ్ల బండ్లతో నార్కట్‌పల్లి – మోత్కూర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ నుంచి ఉదయం, రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని.. దానివల్ల గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణా నిలిపివేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాని కోరారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంగా శివశంకర్



నల్లగొండ రూరల్ : టీఎస్‌ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా శివశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ నుంచి ఆయన బదిలీపై నల్లగొండకు వచ్చారు. నల్లగొండ డిప్యూటీ ఆర్‌ఎంగా పని చేసిన కేశవులు పదవీవిరమణ చేశారు.

యాదాద్రిలో అక్షరధామం విద్యార్థులు




ఆలయాన్ని పరిశీలిస్తున్న బోధకులు, విద్యార్థులు

యాదగిరిగుట్ట : యాదాద్రి ఆలయాన్ని శుక్రవారం గుజరాత్‌లోని అక్షరధామం స్వామి నారాయణ ఆలయానికి చెందిన నీలకంఠ పరిషత్ ఆధ్యాత్మిక బోధకులు, విద్యార్థులు సందర్శించారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కలియదిరిగారు. క్షేత్ర పునర్నిర్మాణ విశేషాలను దేవస్థానం అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాదాద్రి ఆలయాన్ని చూడటానికే ఇక్కడికి వచ్చినట్లు ఆధ్యాత్మిక బోధకులు, విద్యార్థులు తెలిపారు.

పెద్దగట్టుకు పండుగ శోభ

రేపటి నుంచి లింగమంతుల స్వామి జాతర



దురాజ్‌పల్లి గుట్టపై లింగమంతుల స్వామి ఆలయం



శ్రీచౌడమ్మతల్లి, యలమంచమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాలు

- ఐదు రోజులపాటు కొనసాగనున్న వేడుక
- తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఆలయం వద్ద మొదలైన సందడి

చివ్వెంల : పెద్దగట్టు జాతర శోభను సంతరించుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పండుగ. ఈ జాతరకు దాదాపు 260 ఏళ్ల చరిత్ర ఉంది. లింగమంతులస్వామి దర్శనానికి రాష్ట్రంలోని 33జిల్లాలతో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జనవరి 22న యాదవులు సంప్రదాయం ప్రకారం జాతరకు దిష్టిపూజ నిర్వహించగా.. ఈనెల 5వ తేదీ నుంచి జాతర మొదలుకానుంది. ఈ జాతరకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరలో ఆయా శాఖలకు కేటాయించిన పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పెద్దగట్టును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

మొదలైన సందడి..

జాతరకు రెండు రోజుల ముందే పెద్దగట్టు వద్ద సందడి మొదలైంది. జాతరకు సుమారు 50లక్షల మంది భక్తులు వచ్చే అవకాశముంది. జాతరలో జాయింట్ వీల్ (రంగుల రాట్నం), బ్రేక్ డ్యాన్స్, సర్కస్, హంస వాహనం, తదితర ఎగ్జిబిషన్ పరికరాలు, తదితర దుకాణాలు సిద్ధం చేసే పనిలో సంబంధిత వర్గాలు నిమగ్నమయ్యాయి.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు..

గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు గుట్టపై భక్తుల సౌకర్యార్థం అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే చలువ పందిళ్ల ఏర్పాట్లు, ప్రధాన దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇక గుట్టపై వైద్యారోగ్య, పోలీస్, మీడియా, రెవెన్యూ, దేవాలయ శాఖలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్షౌ రశాలను సిద్ధం చేశారు. గుట్టపై జంతుబలితో రక్తం పారి దుర్వాసన వస్తుండడంతో నివారించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతంలో ప్లాట్‌ఫారమ్ నిర్మించి ఒకేమార్గం గుండా రక్తం కిందికి వెళ్లేలా పైప్‌లైన్ నిర్మించారు. గుట్ట కిందిభాగంలో చెరువుకట్టపై బారీకేడ్లు, గుట్టపై, కింది భాగంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. గుట్టకు ఉత్తరభాగంలో ఉన్న కొనేరును శుభ్రం చేసి నీటితో నింపారు. అలాగే జాతీయ రహదారిపై ఉన్న సింహద్వారాలను సుందరంగా ముస్తాబు చేశారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన

జాతర నేపథ్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌లతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్, శానిటేషన్, తాగునీటి వసతి, పార్కింగ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోడి సైదులుయాదవ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా తిరువీధి సేవోత్సవం


ఆలయంలో అమ్మవారికి సేవోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఆండాల్ అమ్మవారిని విశేషంగా అలంకరించి, సేవోత్సవం చేపట్టారు. అనంతరం మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవాన్ని జరిపించారు. మహిళలు మంగళ హారతులు, భాజభజంత్రీలతో సేవోత్సవం ఘనంగా జరిగింది.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన లింగయ్య

ఆత్మకూర్-ఎస్ : ఇంటి నుంచి పనికోసం వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహడ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగొండ లింగయ్య 18రోజుల క్రితం సూర్యాపేట పట్టణానికి పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తండ్రి నల్లగొండ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదవేందర్ రెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

చౌటుప్పల్ : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన గంగనబోయిన ఐలయ్య(40) వృత్తి రీత్యా లారీడ్రైవర్. గురువారం ఐలయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై పంతంగి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐలయ్య శరీర లోపలి భాగంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న గంగనబోయిన శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు


ఎస్‌కే నబీసాబ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : టిప్పర్, టీవీఎస్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో టీవీఎస్‌పై ప్రయాణిస్తున్న భార్యభర్తల్లో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపాలెం గ్రామశివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే నబీసాబ్(65) అతడి భార్య సైదాబీ పొలం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతలపాలెం నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న టిప్పర్ వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నబీసాబ్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య సైదాబీకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గమనించిన స్థానికులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అటునుంచి మెరుగైన చికిత్సకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వారి కుమారుడు ఎస్‌కే సత్తార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

లింగమంతుల జాతర ఇలా..

- ఈనెల 5నుంచి ఐదురోజుల పాటు జరగనున్న జాతర

చివ్వెంల : ఈనెల 5నుంచి ప్రారంభంకానున్న పెద్దగట్టు శ్రీలింగమంతులస్వామి జాతర 5రోజుల పాటు సాగనుంది. ఒక్కోరోజు ఒక్కో విశిష్టతతో జరగనున్న జాతర మొదటగా గంపల ప్రదక్షిణతో ప్రారంభమై.. ఐదోరోజు స్వామివారి ప్రత్యేక దర్శనంతో ముగుస్తుంది.

→ మొదటిరోజు గంపల ప్రదక్షిణ..
జాతరలో మొదటిది అత్యంత కీలకమైన ఘట్టం గంపల ప్రదక్షిణ. దిష్టిపూజ జరిగిన 15రోజుల తర్వాత (ఆదివారం) జాతర ప్రారంభం అవుతుంది. ఆదివారం కేసారం గ్రామం నుంచి చౌడమ్మ తల్లి ఉన్న దేవరపెట్టెను తీసుకొని యాదవ, రెడ్డి కులస్తులు కాలినడకన బయలుదేరి దురాజ్‌పల్లిలో ఉన్న గొల్లగట్టు (పెద్దగట్టు)కు చేరుకుంటారు. ఈ సందర్భంగా గజ్జల లాగులు ధరించి భేరి చప్పుల్లు, కత్తుల విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. ఓలింగా.. నామస్మరణంతో గంపలతో ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు. మెంతబోయిన, రెడ్డి, గొర్ల, మున్నవారి సమక్షంలో రెండు బోనాలు చేసి పూజలు నిర్వహిస్తారు. దీంతో మొదటి రోజు ఘట్టం ముగుస్తుంది.


శ్రీ లింగమంతుల స్వామి ఆలయం

→ రెండో రోజు సౌడమ్మకు బోనాలు..
జాతరలో రెండో రోజు (6వ తేదీ, సోమవారం) చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా మున్న వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డి వంశీయులు తెచ్చిన వర్ద గొర్రె,, మెంతబోయిన వారు తల్లి గొర్రెలను ముందుగా అమ్మవారి ముందు ఆయుధాలతో జల్త పడుతారు. అనంతరం మున్న వంశీయులు ఉపవాసం ఉండి నిష్టతో తెచ్చిన బద్దెపాల గొర్రెను అమ్మవారికి బలి ఇస్తారు. అనంతరం గొర్రె ఆయాలు సాయాలు (పేగులు, లివర్ కిడ్నీలు, నల్లెడ, గుండె, మాంసం) నెయ్యిలో వేసి వంట చేస్తారు. మున్న వంశీయులు యజమానులుగా, మెంతబోయిన వారు జాగిలాలుగా వ్యవహరిస్తూ, మెంతబోయిన వారి మెడలో కండువాలు ఉంచి మున్నవారు పట్టుకోగా బండపై పోసిన అన్నాన్ని మెంతబోయిన వారు నోటితో నాకుతారు (తింటారు).


నీటితో నింపిన కోనేరు

→ మూడో రోజు చంద్రపట్నం..
మూడో రోజు (7న, మంగళవారం) స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా చంద్రపట్నం వేస్తారు. మెంతబోయిన వారు తీసుకొచ్చిన పూజాసామగ్రి, తెల్లపిండి, పచ్చపిండి, పసుపు, కుంకుమలతో చంద్రపట్నం వేస్తారు. చెక్కపై పసుపు, కుంకుమలు వేసి అందంగా పట్నం వేస్తారు. అనంతరం యాదవ వంశీయులు స్వామి వారి కల్యాణం జరిపిస్తారు. దీంతో చంద్రపట్నం , స్వామివారి కల్యాణం తంతు ముగుస్తుంది.

→ నాలుగోరోజు నెలవారం..
జాతరలో నాలుగో రోజు బుధవారం (8న) జరిగే కార్యక్రమం నెలవారం. కేసారం నుంచి పాలు తీసుకొచ్చి రెండు కొత్త బోనం కుండల్లో పాలు పొంగిస్తారు. అనంతరం మున్నావారి గొర్రెను బలిఇస్తారు. ఈ సందర్భంగా బైకాన్లు, బక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు.

→ ప్రత్యేక దర్శనంతో ఐదో రోజు ముగింపు..
జాతరలో ఐదోరోజైన గురువారం (9న) స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. జాతర తంతు పూర్తయిన తర్వాత మొత్తం భక్తులు తుదిసారిగా మొక్కులు చెల్లించి ఇంటి ముఖం పడతారు. దీంతో జాతర ముసిగినట్లు ప్రకటిస్తారు.

జాతరకు బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట డీఎం సురేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక డిపోలో పెద్దగట్టు జాతరకు మొదటి బస్సును డప్పువాయిద్యాల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి పెద్దగట్టు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో యాకాంబరం, ఎస్‌సీ సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న డీఎం


గుట్టపై ఉన్న కోనేరుకు వేసిన రంగులు


కోనేరు పక్కన ఏర్పాటు చేసిన గదులు


జాతరలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్


మెట్ల వద్ద ఏర్పాటు చేసిన ఆహ్వాన ఫ్లెక్సీ


జాతరలో ఏర్పాటు చేసిన బస్ పార్కింగ్


శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి

కనులపండువగా శ్రీపూర్వగిరీశుడి కల్యాణం

- పాతగుట్టలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- అర్ధరాత్రి వైభవంగా లక్ష్మీనరసింహుల పరిణయం

యాదగిరిగుట్ట : శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీనృసింహస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలో గజవాహనంపై శ్రీనృసింహస్వామి, ప్రత్యేక పల్లకిపై శ్రీలక్ష్మీ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్ర వైఢ్యూరాలతో ముస్తాబు చేసి తిరువీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయాధికారులు, ప్రధానాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో ఊరేగింపు..
శ్రీనృసింహుడు దేవేరి శ్రీలక్ష్మీదేవిల పరిణయ వేడుక అద్యాంతం భక్త జనుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలు, భక్తుల జయజయ నినాదాలు, పండితుల వేదమంత్రాల నడుమ శ్రీస్వామి వారు గజవాహనారుఢుడై.. సర్వాలంకార సుశోభితుడుగా, సుందర మనోహరుడుగా.. అమ్మవారు దివ్యాలంకార శోభితమై ప్రత్యేక పల్లకిసేవలో శ్రీస్వామి వారిని అనుసరించగా ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు సేవ సాగింది.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నేడు రథోత్సవం..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం 8గంటలకు హవనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుఢ వాహనంపై శ్రీస్వామి వారిని ఊరేగిస్తారు. రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారి రథోత్సవాన్ని జరిపిస్తారు.

జీలకర్ర బెల్లం.. మాంగళ్యధారణ
ఆది దేవతల తిరుకల్యాణ మహోత్సవంలో విశేషంగా జరిగింది. ఆచార్యులు శ్రీ స్వామికి జంధ్యధారణ చేసి సకల దేవలత ఆశీస్సులతో.. వేద మంత్ర పఠనంతో శ్రీవారు అమ్మవారికి, అమ్మవారు శ్రీవారికి జీలకర్ర బెల్లం పెట్టిన తంతు కనులపండువగా జరిగింది. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ శ్రీనృసింహుడు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి మెడలో మాంగళ్య ధారణ గావించారు.


హనుమంత వాహనసేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, అధికారులు

ఉదయం హనుమంత వాహనంపై..
బ్రహ్మోత్సవంలో భాగంగా ఉదయం 8గంటలకు పారాయణీకులచే నిత్య ప్రబంధ పారాయణములు, యాజ్ఞీకులచే నిత్య హవనములు, మూల, మూర్తిమంత్ర అనుష్ఠానములు, హవనం పూజలు జరిగాయి. అనంతరం శ్రీస్వామి వారికి, అమ్మవారికి వేదమంత్ర మధ్య 'తిరుమంజన మహోత్సవ' వేడుక నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భజన మండలి, వీర పత్రాప భజన మండలిచే భజన, జీవీఆర్ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ వాచిచే భక్తి సంగీతం, మిర్యాల నిఖిల బృందంచే నృత్య ప్రదర్శన నిర్వహించారు.


ఆలయ ఆవరణలో నృత్యం చేస్తున్న కళాకారిణి


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్డీఓ భూపాల్‌రెడ్డి

పేమ్రించినవాడు దక్కడం లేదని..

యువతి బలవన్మరణం


కాకళ్ల మౌనిక (ఫైల్)

రాజాపేట : పేమ్రించినవాడు దక్కడంలేదని మనస్థాపానికి గురైన ఓ యువతి బావిలోదూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పాముకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకల్ల చంద్రమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్నకుమార్తె మౌనిక(20) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండేది. మౌనిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. అతడికి కొద్దిరోజుల క్రితం పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో ప్రేమించిన వ్యక్తి తనకు దక్కడంలేదని మనస్థాపానికి గురైన మౌనిక గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం గ్రామం శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద మౌనిక చెప్పులు లభించడంతో బావిలో వెతకగా శవమై తేలింది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తికి జైలు


మారోజు సతీష్

గుండాల : ఓ మైనర్ బాలికను ప్రేమపేరుతో వేధించిన వ్యక్తికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ భువనగిరి జడ్జి కె.మారుతీదేవి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీ సుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక జనగామ జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. దీంతో అదే గ్రామానికి చెందిన మారాజు సతీష్ అలియాస్ సత్యనారాయణచారి ఆ బాలికను ప్రేమపేరుతో రోజూ వేధించసాగాడు. ఆ బాలిక వేధింపులు తట్టుకోలేక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు సతీష్ తల్లి దండ్రులకు చెప్పినప్పటికీ మార్పురాకపోగా, ఓ రోజు బాలిక కళాశాలకు వెళ్తుండగా అడ్డుకొని ప్రేమించాలని, లేకపోతే చంపుతానని తనకు రోజూ ఫోన్ చేయాలని బెదిరించాడు. దీంతో బాలిక వెంటనే తన తండ్రికి విషయాన్ని చెప్పడంతో 27-09-2017న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు శుక్రవారం కోర్టులో తీర్పుకురాగా నిందితుడికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలం గడ్డికొండారం గ్రామంలోని చాకలికుంటలో శుక్రవారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహం జనవరి 24న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అదే గ్రామానికి చెందిన ఆంజనేయులుగా స్థానికులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. జాలా ఆంజనేయులుతో(30) పానగల్‌లోని లెప్రసీ కాలనీకి చెందిన శ్రేయతో 2018లో వివాహం జరిగింది. ఆంజనేయులు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తుంటాడు. ఇతను మద్యానికి బానిస కావడంతో భార్య శ్రేయ కొద్దిరోజులుగా పుట్టింటి వద్ద ఉంటుంది. ఈక్రమంలో జనవరి 24న ఆంజనేయులు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వారం అయినా ఇంటికి రాకపోవడంతో మృతుడి భార్య ఫిబ్రవరి 2న తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలు కట్టెల కోసం వెళ్తుండగా మధ్యాహ్నం సమయంలో చాకలికుంటలో ఆంజనేయులు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం డెడ్‌బాడీని కుటుంబ సభ్యులకు అందజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే ఆంజనేయులు ప్రమాదవశాత్తు చాకలికుంటలో పడి ఉంచవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రాచకొండలో సరిహద్దుల పరిశీలన

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని రాచకొండ ప్రాంతంలో రెవెన్యూ, ఆటవీ శాఖ భూముల సరిహద్దులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. సర్వే నంబర్లు, భూముల రకాలపై ఆరా తీశారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ముత్యాలు (ఫైల్)

వలిగొండ : మండలంలోని గోకారంలో గురువారం రాత్రి ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటగళ్ల ముత్యాలు (65) తన పొలం వద్ద విద్యుత్ మోటారు పని చేయకపోవడంతో మరమ్మతులు చేయడానికి గురువారం సాయంత్రం వెళ్లాడు. కాగా మోటార్ వద్దకు వెళ్లే దారి నిండా గడ్డి మొలవడంతో కొడవలితో కోస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడున్న కరెంట్ వైరు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయం 10 దాటినా ముత్యాలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతకగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు జనార్దన్‌రెడ్డి మృతి

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతలపురి జనార్దన్‌రెడ్డి (98) శుక్రవారం మృతి చెందాడు. జనార్దన్‌రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పనిచేశారు. జనార్దన్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. ఆయనకు ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

యాదగిరిగుట్ట రూరల్ : పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లగూడెం గ్రామశివారులో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం తెలియడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి గురువారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.65,430నగదు, రెండు కార్లు, 4బైకులు, 10సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.